విద్యార్థులూ ప్రశాంతంగా పరీక్షలు రాయండి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి
- పెదవేగి ఎస్ఎంసీలో అవగాహన సదస్సు



పెదవేగి ఎస్ఎంసీలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి

పెదవేగి : ప్రభుత్వం అందిస్తున్న చక్కటి సదుపాయాలను ఉపయోగించుకుని విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి సూచించారు. శుక్రవారం పెదవేగి ఎస్ఎంసీ చిల్డ్రన్ హోమ్‌లో విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి మాట్లాడుతూ భారత ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశానుసారం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సూచనలను, ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షలపై మాట్లాడిన కార్యక్రమాన్ని చూసి పిల్లలందరూ ఉత్తేజం చెందాలని చెప్పారు. ఈ పరీక్షల సమయంలో బాలబాలికలు ఏ విధమైన ఆందోళన చెందకుండా ప్రశాంతంగా మంచి వాతావరణంలో ఉండేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వారికి తర్ఫీదు ఇవ్వటానికి ప్రత్యేకించి ఉత్తేజపరిచే ఉపన్యాసకులతో, మానసిక శాస్త్రవేత్తలతో, తత్వ శాస్త్రవేత్తలతోనూ పిల్లలతో మాట్లాడించి పరీక్షలకు వారిని సంసిద్ధులను చేసి వారిలోని భయాందోళన తొలగిస్తున్నామన్నారు. విద్యార్థులు సంతోషంగా పరీక్షలు రాసి విజయవంతమయ్యేలా కృషి చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలోని ఆరో తరగతి నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అందరినీ పరీక్షలకు సంసిద్ధులయ్యే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా బాలల సంరక్షణ యూనిట్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ద్వారా కార్యక్రమాలు 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదవేగి మండలం ఎస్ఎంసీ చిల్డ్రన్ హోమ్‌లోని సుమారు 70 మంది పిల్లలకి వివిధ స్థాయిల్లో వేరువేరు కార్యక్రమాలు నిర్వహించి వారిలో ఉన్న భయాందోళనలను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, జిల్లా ఎర్లీ ఎడ్యుకేషన్ సెంటర్ నుంచి సైకాలజిస్ట్ డాక్టర్ బిందు, జిల్లా బాలల సంరక్షణ యూనిట్‌లో ఉన్న బాల రక్షణాధికారి ఆర్ రాజేష్, కౌన్సిలర్ బాలస్వామి చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా విధానంపై అవగాహనతో సత్ఫలితాలు


పెదనింద్రకొలను స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో కె. బాలయ్య

నిడమర్రు: ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు డిజిటల్ విద్యా విధానంపై అవగాహన ఉన్నప్పుడే ప్రభుత్వ విద్యలో సత్ఫలితాలు సాధించవచ్చని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. డీఈవో ఎస్ అబ్రహం ఆదేశాల మేరకు శుక్రవారం పెదనింద్రకొలను, తోకలపల్లి జెడ్పీ స్కూలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బోధనా సంబంధిత అంశాలను పరిశీలించి రికార్డు చేసుకున్నారు. డిజిటల్ బోధనలోని ఐఎఫ్‌పీలు, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, నెలవారీ సిలబస్, వర్క్‌బుక్స్ వంటివి పరిశీలించి ఉపాధ్యాయులకు విద్యార్థులకు తగిన సూచనలు ఎంఈవో బాలయ్య అందించారు.

నేడు ప్రజా ఆశీర్వాద యాత్ర

పెదపాడు: పెదపాడు మండలంలో శనివారం నుంచి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. మండలంలోని సత్యవోలులో మధ్యాహ్నం 3 గంటల నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. సకల కొత్తపల్లి, కడిమికుంట, కొనిణి వడ్డిగూడెం గ్రామాల్లో పాదయాత్ర అనంతరం వడ్డిగూడెంలో ఎమ్మెల్యే కొఠారు రాత్రి బస చేస్తారు. అనంతరం ఆదివారం ఎమ్మెల్యే పాదయాత్ర ప్రారంభించి వడ్డిగూడెం, గుడిపాడు, ఖాజీగూడెం, నాయుడుగూడెం పర్యటించి అనంతరం రాత్రి బస చేస్తారని చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

నిడమర్రు: జగనన్న ఆరోగ్య వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో శివరామకృష్ణయ్య కోరారు. శుక్రవారం బువ్వనపల్లి యూపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 405 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, వైఎస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, వైద్యాధికారి కె. భాగ్యశ్రీ, డాక్టర్లు అశ్విత, కె. కిషోర్, ఎంపీహెచ్‌వో పి.కృపావరం పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంచినీటి బోరుకు శంకుస్థాపన


మంచినీటి బోరుకు శంకుస్థాపన పూజ చేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: గోపినాథపట్నంలో శుక్రవారం మంచి నీటి బోరు పనులకు ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి భూమి పూజ చేశారు. గ్రామంలో మంచి నీటి ట్యాంకు నిర్మించారు. ఈ పనుల్లో భాగంగా రూ.5 లక్షల వ్యయంతో బోరు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా లక్ష్మణరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

దెందులూరు: దెందులూరులో శుక్రవారం దెందులూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ భాస్కర్, దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్లల్లో ఉండాల్సిన వసతులను పరిశీలించి నివేదిక సిద్ధం చేశారు. వారితో పాటు దెందులూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ, వీఆర్వోలు శ్రీను, అనిరుధ్ ఉన్నారు.

పోలింగు కేంద్రాలను పరిశీలించిన అధికార్లు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని నీలాద్రిపురం, నారాయణపురం, ఉంగుటూరులోని పోలింగు కేంద్రాలను కొత్తగా వచ్చిన ఎస్సై మణికుమార్, ఎంపీడీవో శర్మ, తహసీల్దారు వెంకటశివయ్య శుక్రవారం పరిశీలించారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

గణపవరం: గణపవరం మండలం మొయ్యేరు పెద ఎస్సీ పేట ప్రజల చిరకాల కోరిక సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ దుళ్ల కుటుంబరావు శంకుస్థాపన చేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు ఈప్రాంత వాసులు సీసీ డ్రెయిన్ నిర్మించాలని కోరారు. సీసీ రోడ్లు ఉన్నా తమ ప్రాంతంలో డ్రెయినేజి సదుపాయంలేక మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వాసుబాబు సిఫార్సు మేరకు ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయగా ఆ నిధులతో సీసీ డ్రెయినేజి నిర్మాణం చేపట్టారు. శుక్రవారం స్థానిక పెద్దల ఆధ్వర్యంలో నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామ వైఎస్సార్ సీసీ అధ్యక్షుడు గంటా పద్మాజీరావు, ఉపాధ్యక్షుడు దాసురమేష్, పార్టీ నాయకులు మాకా శ్రీను, పొట్ల గమనియేలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఆడిట్ సభ్యులకు సహకరించాలి

ఉంగుటూరు: ఉపాధి హామీ పనులపై తనిఖీకి వచ్చిన ఆడిట్ సభ్యులకు ఫీల్డు సిబ్బంది సహకరించాలని ఎంపీడీవో శర్మ సూచించారు. శుక్రవారం ఉంగుటూరులో ఉపాధిహామీ పనులపై ఆడిట్ సభ్యులు రేపటి నుంచి గ్రామాల్లో పరిశీలిస్తారని వారికి ఫీల్డు సహాయకులు, మేట్లు సహకరించాలని అన్నారు. ఉపాధిహామీ ఏపీవో మల్లేశ్వరరావు, ఎస్ఆర్ పి రామచంద్రరావు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్ఈజీఎస్, ఫారెస్టు, హౌసింగు అధికార్లు, ఫీల్డు సహాయకులు, మేట్లు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి అభిషేకాలు

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి శ్రవణ నక్షత్రం సందర్భంగా అభిషేకాలు, విశేష పూజలు ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో వంశీ, సిబ్బంది మాధవి, ఆలయ అభివృద్ధి కమిటి నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు, నల్ల శ్రీను, రాంబాబు, వీర్రాజు, భక్తులు పాల్గొన్నారు.

శివాలయానికి నంది విగ్రహం సమర్పణ

పెదవేగి : శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు నంది విగ్రహాన్ని సమర్పించారు. ఈనెల 11న రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న శివాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం నేపథ్యంలో నంది విగ్రహాన్ని అందజేసిన కొఠారు రామచంద్రరావు శుక్రవారం కొండలరావుపాలెంలో ఆ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీఎల్వో విధుల నుంచి తొలగింపు

భీమడోలు: అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల బీఎల్వోగా విధులు నిర్వర్తిస్తున్న నెర్సు దేవి వరలక్ష్మిని ఎన్నికల విధుల నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు భీమడోలు తహసీల్దార్ జి.వరహాలయ్య శుక్రవారం తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్ దేవి వరలక్ష్మీ బీఎల్వో విధులను నిర్వహిస్తోంది. ఆమెపై వచ్చిన అభియోగంపై సంబంధిత అధికారులు విచారణ చేసారు. ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించి ఆమెను ఎన్నికల విధుల నుంచి తప్పించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

రూ.70 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం


దెందులూరు సొసైటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, నాయకులు

దెందులూరు: దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ రోడ్డుకు మోక్షం లభించింది. జిల్లా పరిషత్ నిధులు రూ.70 లక్షలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కిలోమీటరు మేర అంతకు ముందు 3 మీటర్లు ఉండే రోడ్డును 5.50 మీటర్ల వెడల్పుతో పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. శుక్రవారం ఆయన సొసైటీ రోడ్డును పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు కొలుసు గణపతిరావు, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, నున్నా కిషోర్, గోరిపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సంపంగి వేణుగోపాల్‌తిలక్, కృష్ణవేణి, ఎఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలదేవి, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పీ. ఆనంద్, కొంగర రత్నకుమార్‌అబ్బాస్, రాము తదితరులున్నారు.

ఆత్మ విశ్వాసం విజయానికి పునాది


ప్రతిభ గల విద్యార్థులు బహుమతులను అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

భీమడోలు: ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం కలిగి క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించడం ఖాయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆత్మరక్షణ విభాగం జిల్లా డైరెక్టర్ సైకాలజిస్ట్ ఏ.జయలక్ష్మి అన్నారు. పోలసానిపల్లి అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో శుక్రవారం పదో తరగతి, కళాశాలల విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఏ విధంగా సంసిద్ధత కలిగి ఉండాలి, ఉత్తీర్ణత అనంతరం అందుబాటులో ఉన్న కోర్సులు, నైతిక విలువలతో కూడిన విద్య తదితర అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, సైకాలజిస్ట్ ఏ.జయలక్ష్మి పాల్గొని వారికి అవగాహన కల్పించారు. నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే లక్ష్యం సాధించడం సులువు అవుతుందన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రతిభ గల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు, డిక్షనరీలు, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆర్.గంగాధరరావు, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర గ్రామాభివృద్ధిపై శిక్షణ


శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్న గోకవరం సర్పంచ్ మిద్దే సత్యవతి

ఉంగుటూరు: గ్రామం సమగ్రాభివృద్ధి ఎలా సాధించాలనే విషయాలపై (ఐయస్ఆర్‌డి)పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఎంపిక చేసిన వివిధ రాష్ట్రాలకు చెందిన సర్పంచులకు ఇచ్చిన అయిదు రోజుల శిక్షణ శుక్రవారంతో హైదరాబాదులో ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన అనంతరం ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి శుక్రవారం మాట్లాడుతూ శిక్షణ ద్వారా అనేక అంశాలపై అవగాహన కల్పించారని అన్నారు. గ్రామ పంచాయతీ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, ప్రణాళికల రూపకల్పన, చట్టాలపై అంశాలపై శిక్షణనిచ్చారని సత్యవతి చెప్పారు. తమిళనాడు, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాలకు చెందిన 21 మందికి శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఇందులో ఏడుగురు సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. తెలంగాణలోని హాజపల్లి స్మార్టు విలేజికి క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్లారని సత్యవతి తెలిపారు.

ఎస్సై స్వామికి సత్కారం

ఉంగుటూరు: ఎస్సై స్వామి మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని పులువురు కొనియాడారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఎస్సైగా పనిచేసి దెందులూరు బదిలీ అయిన స్వామికి అభినందన సత్కారం గురువారం రాత్రి నిర్వహించారు. ఈకార్యక్రమానికి సీఐ సుబాష్ అధ్యక్షత వహించారు. ఉంగుటూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, నాయకులు పాపారావు బాబ్జి, పుప్పాల గోపి, అడపా శ్రీను, కొరిపల్లి శ్రీను, సర్పంచుల చాంబరు అధ్యక్షుడు పి .విష్ణుమూర్తి, యర్రమిల్లిపాడు సర్పంచి తమ్మిన శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై స్వామిని శాలువాతో సత్కరించారు.

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయ నిధి


లక్ష్మీజ్యోతికి రూ.5.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా ఉంటోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శ్రీరామవరానికి చెందిన కమ్మ లక్ష్మి జ్యోతి అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. శుక్రవారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తన కార్యాలయంలో లక్ష్మి జ్యోతికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన రూ. 5.50 లక్షల చెక్కును అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ శ్రీరామవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, రాంబాబు ఉన్నారు.

రూ 2.50 లక్షల చెక్కు అందజేత

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి సహాయం పొందవచ్చని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామానికి చెందిన నాగళ్ల సంధ్యారాణి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ 2.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి బాధిత లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

వృద్ధుడికి ఆర్థిక సాయం

పెదవేగి : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడిని పరామర్శించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆర్థిక సాయాన్ని అందించి మరోమారు దాతృత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం పెదవేగి మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన పరసా నాగయ్యను పరామర్శించి ఎమ్మెల్యే వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల యువజన విభాగ అధ్యక్షులు చిట్టిబొమ్మ జగదీష్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయిస్తూ ఆ రంగం బలోపేతానికి కృషి చేస్తున్నారని మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ అన్నారు. భీమడోలు ఆర్‌బీకే-1 వద్ద శుక్రవారం మండల సాగు సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏవో ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పసుపులేటి సత్యనారాయణ హాజరయ్యారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ, మత్స్యశాఖ, విద్యుత్ శాఖల అధికారులు పలు అంశాలపై చర్చించారు. తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, వివిధ పథకాల అమలు, ప్రగతిని వివరించారు. ఈనెల 15వ తేదీలోగా రైతులంతా ఈక్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏవో ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. వెటర్నరీ వైద్యులు హరికృష్ణ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, రైతులు ప్రతి పశువుకు రూ.385 చెల్లిస్తే ఏదైనా ప్రమాదశాత్తు లేదా అనారోగ్యంతో మృతి చెందితే నష్టపరిహారం రూ.30 వేలను అందిస్తుందన్నారు. ఎల్ఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు విద్యుత్ కనెక్షన్లు, కెపాసిటర్లు ఏర్పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి తమ దరఖాస్తులను గ్రామ సచివాలయాల్లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి దేవదానం, తొలుత మండలి సభ్యు లు కేతినీడి విశ్వేశ్వరరావు, కిలపర్తి రుగ్మాంగధరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి దుర్గాభవానీ, కమిటీ సభ్యుడు చెక్కా వుల్ల య్య, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి సాయికిరణ్‌కు సత్కారం


శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో డి.సాయికిరణ్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్స్, అధ్యాపకులు

భీమడోలు: ద్వారకాతిరుమల దేవస్థానం ఆధీనంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన సీనియర్ అండర్ అధికారి డి.సాయికిరణ్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి, సీనియర్ అండర్ అధికారి డి.సాయికిరణ్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రతిభ చాటాడని, అక్కడి నుంచి శుక్రవారం కళాశాలకు వచ్చిన సందర్భంగా సాయికిరణ్‌కు తోటి విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ఘన స్వాగతం పలికారు. అభినందన కార్యక్రమానికి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.రవికుమార్ మాట్లాడుతూ సాయికిరణ్‌ను విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. డి.సాయికిరణ్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కె.శివశంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డీఎంబీబీ భవానీసింగ్, మాధవి, సీహెచ్ బదిరీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రేషన్ డీలర్ల కృతజ్ఞతలు

దెందులూరు: రేషన్ డీలర్లకు, వారి కుటుంబ సభ్యులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు ఎన్నటికీ మరువలేమని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం పోతునూరులో ఆయన మాట్లాడుతూ 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న ఐసీడీఎస్ కమిషన్ నిధులు రూ.23.71 కోట్ల చెక్కును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి కారుమూరికి యూనియన్ తరపున దెందులూరు మండల డీలర్లు వీ.ఆరోగ్యం, మురళీ, వీ. నాగ, బీ.శివ, లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన

భీమడోలు: కోడూరుపాడు, ఆగడాలలంకలో శనివారం ఎమ్మెల్యే వాసుబాబు, ఏలూరు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కోడూరుపాడులో రూ.6 లక్షలతో నిర్మించిన చెరువు, రేవుల ప్రారంభోత్సవం, ఆగడాలలంకలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్ర వేస్తున్న పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి

పెదపాడు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో భాగంగా పెదపాడు మండలంలోని వట్లూరులో పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ ఆదిలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

98 శాతం చిన్నారులకు మాత్రలు పంపిణీ

గణపవరం: గణపవరం మండలంలో 98 శాతం మంది విద్యార్థులు, యువకులకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 5,926 మంది పిల్లలకు లక్ష్యంగా కాగా 5,750 మందికి అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి శనివారం మాత్రలు వేస్తామన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాలసురక్ష కార్యక్రమంలో భాగంగా హైస్కూలులో 20 మంది విద్యార్థులకు ఒక పీర్ ఎడ్యుకేటర్‌ను నియమించినట్లు తెలిపారు. వారికి బ్రౌజర్లు, టోపీలను అందజేశారు.

ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ తగదు

దెందులూరు: ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ తగదని గోపన్నపాలెం వ్యాయామ ప్రభుత్వ విద్యాకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సత్తానియేలు అన్నారు. గోపన్నపాలెం కళాశాలలో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న నులిపురుగుల నివారణ మాత్రలను యూజీడీ, జీపీఈడీ విద్యార్థినులు 200 మందికి ప్రిన్సిపల్ అందజేశారు. గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి

భీమడోలు: విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి చేస్తోందని భీమడోలు సర్పంచ్ పాము సునీత అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీ పరిధిలోని 19 ఏళ్ల లోపు చిన్నారులు, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 11,355 మందికి గాను 10,903 మందికి మాత్రలు వేసి 96 శాతం నమోదు చేసారు. పూళ్ల పీహెచ్‌సీ పరిధిలో 4,060 మందిలో 4,026 మాత్రలు వేసుకోవడంతో 99 శాతం నమోదైంది. భీమడోలు ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పాము సునీత, వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీలక్ష్మీలు చిన్నారులకు మాత్రలు వేసారు. పోలసానిపల్లి-1 పాఠశాలలో సర్పంచ్ షేక్ రహీమాబేగం, ఎంపీటీసీ సభ్యురాలు అంబటి దేవి చిన్నారులకు మాత్రలకు వేసారు. జిల్లా ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి అంబటి నాగేంద్ర ప్రసాద్, ఇంచార్జి హెచ్ఎం అహ్మద్, ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర కుమార్, సూపర్‌వైజర్ ఎస్‌కే నవీన్, వైద్యారోగ్య శాఖ సిబ్బంది మురళీ, చంద్రకళ, అంగన్‌వాడీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.